క్లుప్తంగా

అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



ప్రొసీడింగ్ అందిస్తున్న భోగ శ్రావణి

రాయికల్: అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు.మండలంలోని మైతాపూర్‌లో ఎస్సీ మాల కుల సంఘ భవనం , రాయికల్ పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కుల సంఘ భవనాలకు మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను అందించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజనాల మధు, నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, శివనీతి రమ్య, దుంపల లలిత, లింగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, ఆశన్న, మల్లారెడి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు

రాయికల్: పట్టణంలో ఆర్పీల పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలని, అదే విధంగా కుటుంబ పోషణకు రూ.20 వేల వేతనం , డ్రెస్‌కోడ్, రూ.10 లక్షల ఆరోగ్యబీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్పీలు సుమలత, రమ్య, జయసుధ, ఉమారాణి, జ్యోత్స్న పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి



వినతిపత్రం అందిస్తున్న తపస్ నాయకులు

జగిత్యాల: ఈనెల 22న అయోధ్య శ్రీరామ మందిరం ప్రతిష్ఠ ఉత్సవం సందర్భంగా సెలవు ప్రకటించాలని తపస్ నాయకులు అదనపు కలెక్టర్ బీఎస్.లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22న దేశమంతా పండగ వాతావరణం ఉంటుందని, సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, అయిల్నేని నరేందర్, మహిపాల్‌రెడ్డి, రఘునందన్, రజినికాంత్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలు



అక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని 23వ వార్డులో అయోధ్య బాల రాముని అక్షింతలను శుక్రవారం గడప గడపకూ అందజేశారు. మహిళలు మంగళ హారతులతో అక్షింతలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, ఆర్ఎస్ఎస్ జగిత్యాల జిల్లా ప్రముఖ్ గట్ల శివకుమార్, బీజేపీ అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ భూమయ్య

కథలాపూర్: మండలంలోని చింతకుంట జెడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం జెడ్పీటీసీ నాగం భూమయ్య భూమిపూజ చేశారు. రెండు తరగతి గదులకుగాను జెడ్పీ నిధులు రూ.20 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లోక నర్సారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ సోమ దేవేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని వైకుంఠధామాలు

- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వైనం
- ఆనవాళ్లు కోల్పోయిన శ్మశాన వాటికలు
- చాలా గ్రామాల్లో గోదావరి పక్కనే నిర్మాణం



భవనం కూలిన కమ్మునూర్ వైకుంఠధామం



భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కొల్వాయి వైకుంఠధామం

సారంగాపూర్: గ్రామాల్లో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు నిర్వహించడానికి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద వైకుంఠధామాలు నిర్మించింది. అయితే సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో చాలా వైకుంఠధామాలు గోదావరి చెంతనే నిర్మించారు. 2022 జూలై నెలలో వచ్చిన వరదలతో బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి, కమ్మునూర్ గ్రామాల వైకుంఠధామాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో పాటు 2023 ఆగస్టులో వచ్చిన భారీ వర్షాలకు సారంగాపూర్ మండలం కోనాపూర్ వైకుంఠధామానికి పాక్షికంగా నష్టం వాటిల్లింది.

వైకుంఠధామంలో వసతులు ఇలా...

ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ. 10.50 లక్షల నిధులతో వైకుంఠధామాలను నిర్మించింది. మరికొన్ని గ్రామాల్లో గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 12.50 లక్షలు వెచ్చించి నిర్మించింది. వైకుంఠధామంలో రెండు బర్నింగ్ ప్లాట్‌ఫాంలు, ఆడ, మగవారికి వేరువేరుగా స్నానాల గదులు (షవర్లతో సహా), మరుగుదొడ్లు, ఓ గదిలో కార్యాలయం, హాల్ నిర్మాణం, బోరు, విద్యుత్ సౌకర్యం, చుట్టూ ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేశారు.

వర్షాలకు జరిగిన నష్టం ఇలా..

బీర్‌పూర్ మండలం కమ్మునూర్ వైకుంఠధామాన్ని పంచాయతీరాజ్ నిధులు రూ. 12 .50 లక్షలతో గ్రామ శివారుల్లో నిర్మించారు. గోదావరి తీరం వెంట నిర్మించడంతో 2022 జూలైలో గోదావరి నది ఉప్పొంగి వైకుంఠధామంలోని కార్యాలయ భవనం పిల్లర్ విరిగిపోయి భవనంలోని హాల్, గది కుంగిపోయాయి. మరుగుదొడ్లు, స్నానాల గదుల కిటికీలు, తలుపులు కొట్టుకుపోయాయి. నీరందించే బోరు కొట్టుకుపోగా, మోటారు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా వైకుంఠధామం నిండా ఇసుకమేటలు వేశాయి.

ఆనవాళ్లు లేని కొల్వాయి వైకుంఠధామం

బీర్‌పూర్ మండలం కొల్వాయి వైకుంఠధామం పరిస్థితి మరి దయనీయంగా మారింది. 2022 జూలైలో భారీ వర్షాలు, వరదలకు బీర్‌పూర్ శివారుల్లోని రోళ్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో ప్రాజెక్టు దిగువన ఉన్న కొల్వాయి వైకుంఠధామం ఆనవాళ్లు లేకుండా పూర్తిగా కొట్టుకుపోయింది.

కోనాపూర్ వైకుంఠధామం...

సారంగాపూర్ మండలంలోని కోనాపూర్ వైకుంఠధామం కోనాపూర్ వాగు వెంట నిర్మించడంతో 2023 జూలై, ఆగస్టు నెలల్లో భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి వైకుంఠధామంకు తీవ్ర నష్టం జరిగింది. దీంతో అంత్యక్రియలకు స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి

2022లో రోళ్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో మా గ్రామంలో వైకుంఠధామం పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతులు చేయడానికి క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు విడుదల కాలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.



– మేను ఏసుదాసు, సర్పంచ్, కొల్వాయి

ప్రతిపాదనలు పంపించాం

నష్టం జరిగిన వైకుంఠధామాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడానికి వరదల్లో కొట్టుకుపోయిన సమయంలోనే అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాం.. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.



భూపతి,పీఆర్ ఏఈ,సారంగాపూర్

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మహిళలతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి: పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కట్లకుంటలో శుక్రవారం నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. తన విజయానికి కృషి చేసిన కట్లకుంట గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నారు. గొప్ప విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. పాలనలో మార్పు కావాలని ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి పేర రూ.6 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కట్లకుంటలో లింకు రోడ్లు పూర్తిచేస్తామని, మేడిపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరుకు కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి అండగా ఉంటాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



బీమా పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

మల్యాల: అకాల మరణం చెందిన రైతు కుటుంబానికి అండగా నిలుస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని నూకపల్లి గ్రామానికి ఎనుగందుల గంగారాం అనే రైతు గుండెపోటుతో మృతి చెందగా, రైతు బీమా కింద బాధిత కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను శుక్రవారం కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఏవో చంద్రదీపక్, సర్పంచ్ మారంపల్లి సరోజనగంగాధర్, కాంగ్రెస్ నాయకులు వెల్మ లక్ష్మారెడ్డి, ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి,బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఇమామ్, ముత్యం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించేలా కృషి చేయాలి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి: గురుకులంలో విద్యార్థులు చదువుల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచించారు. పట్టణంలోని జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వంట గది, భోజనశాలతో పాటు తరగతి గదులను పరిశీలించారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి హాస్టళ్లలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులు చదువుల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

వెల్లులలో ఎమ్మెల్యే సంజయ్ పర్యటన

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పర్యటించారు. గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా శుక్రవారం గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ, సీసీరోడ్లు, పెద్ద చెరువు తూము చెత్తతో నిండిపోవడంతో పంట పొలాలకు నీరందడంలేదని, మరికొన్ని సమస్యల గురించి పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిరెడ్డి,ఎంపీడీవో భీమేష్‌రెడ్డి,ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి,ఏపీవో తిరుపతి,పంచాయతీ కార్యదర్శి అశోక్,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన పతంగి ఈశ్వరి గత కొన్ని రోజుల క్రితం విద్యుత్ ప్రమాదంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి మంజూరైన రూ. 5 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీ, ఏఈ, నాయకులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్

ఆలయాలకు దారి ఇవ్వాలని రాస్తారోకో



తిమ్మాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: ఆలయాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. గ్రామశివారులోని కోమ్ముల రాజరెడ్డి, కోమ్ముల మోహన్‌రెడ్డి, కోమ్ముల రాజుకు చెందిన పంట పొలాల్లో 5 చేతుల పోచమ్మ, మహాలక్ష్మీ ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు వెళ్లేందుకు పొలాల ఒడ్లపై నడుచుకుంటు వెళ్లి మొక్కులు చెల్లించుకునేవారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భూ యజమానులతో మాట్లాడి 4 ఫీట్ల స్థలం ఇవ్వాలని అడిగారు. వారు ఒప్పుకోవడంతో ఆ స్థలంలో భక్తులు రోడ్డు వేశారు. కానీ ఈ రోడ్డును భూ యాజమానులు తీసివేసి, తమ కుటుంబాలను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు బహిష్కరించారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామస్తులు ఆలయాలకు వెళ్లేందుకు స్థలం ఇచ్చి, కేసులను వాపస్ తీసుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సై ఉమాసాగర్ అక్కడకు చేరుకుని ఆందోళన విరమించాలని కోరగా, వారు వినలేదు. దీంతో భూయజమానులతో వీడీసీ సభ్యులు చర్చించారు. ఆలయాలకు వెళ్లేందుకు దారి ఇస్తామని, కేసు ఉపసంహరించుకుంటామని తెలపడంతో ఆందోళన విరమించారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రజితరావు

జగిత్యాల: పట్టణంలోని మానస హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు యూనిఫైడ్ కౌన్సిల్ వారిచే జాతీయస్థాయిలో నిర్వహించిన సైబర్ ఒలింపియాడ్ పరీక్షల్లో సత్తా చాటారు. ఇందులో శిశిర్ 640 ర్యాంక్ సాధించగా, రిషిత్‌గౌడ్ 740, తోట హరికీర్త 872, నవదీప్ 974, హసిత 1094, గీతిక 1170, దీక్ష 1148, ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రజితరావు, శ్రీధర్‌రావు విద్యార్థులను అభినందించారు.

కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక

జగిత్యాల: పట్టణంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన ఐఐటీ అకాడమీకి చెందిన విద్యార్థులు ఈనెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఖేల్ ఇండియా యూత్ గేమ్స్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సహస్ర, విష్ణువర్ధిని, ఫిర్దోస్‌లను డైరెక్టర్లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, రజితరావు అభినందించారు.

వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలి



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల: వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మినీ స్టేడియంలో వివేకానంద యువజనోత్సవాల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలని, దేశం అభివృద్ధి చెందాలంటే యువత వల్లే సాధ్యమన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ లోకేశ్, ఏబీవీపీ కన్వీనర్ సాయికుమార్, రాజు, చందు, మనోహర్ పాల్గొన్నారు.

పెగడపల్లిలో యువజన వారోత్సవాలు

పెగడపల్లి: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ యువజన వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో విద్యార్థులకు ప్రతిభ పోటీలతో పాటు ఏడుమోటలపల్లిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యువతకు ఆదర్శం స్వామి వివేకనందుడని ఈ తరం యువతతో పాటు విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో పెగడపల్లి, ఏడుమోటలపల్లి సర్పంచులు మేరుగు శ్రీనివాస్, ఇస్తావత్ రవినాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి, ఆర్గనైజర్ గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో ముందుకెళ్లాలి

మల్లాపూర్: యువత, విద్యార్థులు సన్మార్గంలో ముందుకెళ్లాలని ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేగుంటలో గ్రామానికి చెందిన మోతే రవితేజ అందించిన స్పోర్ట్స్ టీ-షర్టు (జెర్సీ)లను శుక్రవారం క్రీడాకారులకు అందజేశారు. యువత, విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు దోహదపడుతాయని, చదవుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మోతే భూమయ్య, భూమనందం, క్రీడాకారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులలోని దసరా గుట్టపై ఉన్న ప్రహ్లాద సహిత లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ సర్వతోభద్ర మంటప పూజ,అభిషేకాలు,మూలమంత్ర హవనం,హోమాలు చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు, వీడీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండిలో శుక్రవారం ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎస్సై ఉమాసాగర్ ప్రారంభించారు. రేకుర్తి కంటి వైద్యులు ప్రభాకర్ 82 మందికి కంటి పరీక్షలు చేసి, 35 మందిని ఆపరేషన్ కోసం రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డివిజన్ చైర్మన్ శివశ్రీనివాస్, జోనల్ చైర్మన్ గంగుల మురళి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల రంజిత్, సర్పంచ్ కల్లెడ లక్షణ, లయన్స్ క్లబ్ కార్యదర్శి రెబ్బటి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భర్తపై భార్య దాడి

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని పురాణిపేటలో భార్య భర్తపై కత్తితో దాడి చేయడంతో భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. హుజూరాబాద్‌కు చెందిన జయరాజ్ జగిత్యాలకు చెందిన ఓ మహిళతో వివాహం జరిగింది. గత కొంత కాలంగా వీరి ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో జయరాజ్‌పై భార్య కత్తితో దాడి చేయడంతో జయరాజ్‌కు వీపు, మెడపై బలమైన గాయాలు తగిలాయి. దీనితో స్థానికులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

జగిత్యాల: పార్లమెంట్ ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలని బహుజన సమాజ్ పార్టీ నాయకుడు లింబాద్రి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, మూడు నియోజకవర్గాలు ధర్మపురి, కోరుట్ల, జగిత్యాలలో బూత్‌కమిటీలు వేసి పార్టీ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించాయని, గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్, చిర్ర శంకర్, సంపత్‌కుమార్, నక్క విజయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు

వెల్గటూర్ : ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని మండల తహసీల్దార్ ఏ.శేఖర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవార డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నీలం సంపత్, నాయబ్ తహసీల్దార్ గంగాధర్, గిర్దవార్ రాజేశ్వరి, డీటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు సాగర్, మహేష్, ఎండపల్లి అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణం, సతీష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురికి కాల్వల నిర్మాణానికి సర్వే

సారంగాపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మురికి కాల్వల నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇటీవల గ్రామాన్ని సందర్శించిన సమయంలో గ్రామంలోని ఎస్సీలు మురికి కాల్వల నిర్మాణాలు సరిగా లేక నీరు కాలనీ మధ్యలో నిలిచిపోతుందని ఈ కారణంగా రోగాల బారిన పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకవచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సర్వే చేపట్టి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించడంతో ఏఈ (పీఆర్) భూపతి సర్వే పనులు పూర్తి చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ న్యారబోయిన గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, నాయకులు ఉన్నారు.

స్వీప్ కార్యక్రమాలపై అవగాహన

మల్లాపూర్: ఓటరు చైతన్యం, అవగాహన కోసం చేపడుతున్న స్వీప్ ప్రచార కార్యక్రమాలు ఓటర్లను ఆకర్షించేవిగా ఉండాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుండంపల్లి, సాతారం గ్రామాల్లో శుక్రవారం స్వీప్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీప్ ప్రచార కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించాలన్నారు. ఓటింగ్ తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో తప్పనిసరిగా స్వీప్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)-2024కి సంబంధించి గ్రామసభలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొడ్డు సుమలత, దనరేకుల మల్లు, ఎంపీటీసీలు గున్నాల శ్రీనివాస్, మామిడి మంజుల, ఉపసర్పంచ్‌లు మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్, మైలారపు వేణు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందడంతో మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కట్ల శంకర్ శుక్రవారం మర్రివ్వ ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ముడుపులు కట్టిన డబ్బులు దేవతకు సమర్పించారు. అనంతరం టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో నాయకులు భైర మల్లేశ్, లోక నర్సారెడ్డి, భూమరెడ్డి, మహేశ్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రాయికల్: పట్టణంలోని స్త్రీవైద్య నిపుణులు ఒడ్నాల రజిత తన జన్మదినం సందర్భంగా శుక్రవారం ఇటిక్యాల వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి, సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శశికాంత్‌రెడ్డి నాయకులురమేశ్, సంతోష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాయికల్: మండలంలోని అల్లీపూర్, కిష్టంపేట గ్రామాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. రోడ్లను శుభ్రం చేయాలని, చెత్తచెదారం తొలగించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో సుష్మ ఉన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: మండలంలోని తిప్పన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలోని పెర్కపల్లి, తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట, హైదర్‌పల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ ఏఈ సుందర్ తెలిపారు.

ధరూర్‌లో...

ధరూర్, మోతె, వెల్దుర్తి, గొల్లపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, యామాపూర్, వేములకుర్తి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తులకు నేటితో గడువు ముగింపు

మెట్‌పల్లి: మహాత్మా జ్యోతి బాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో ప్రవేశానికి గాను నిర్వహించే పరీక్షకు దరఖాస్తు గడువు శనివారంతో ముగియనుందని బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటగిరి ఆనందం తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 3న ఉంటుందని, ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.